

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న నెల్లూరు జిల్లా - కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 17, ప్రభాతవార్త – కలెక్టరేట్** ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న నెల్లూరు జిల్లాలో ఐటీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. కమర్షియల్‌భవనాలు,కార్యాలయస్థలాలు, భూముల యజమానులు తమ వివ రాలను ఐటిఇన్ఫ్రా.ఏపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉచితంగా నమోదుచేసి ఐటీ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయనకోరారు. ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రామచంద్రరావును సన్మానించిన మాజీ ఉపరాష్ట్రపతి



**కోవూరు జులై 17 ప్రభాతవార్త** దేశంలోనే ఎమర్జెన్సీ విధించి 51 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని అప్పట్లో దానిని వ్యతిరేఖించి అరెస్టు అయిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మిత్రుడు సాయిని రామచంద్రావును శుక్రవారం మాజీ ఉపరాష్ట్రపతి తన స్వగహంలో శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్బంగా అప్పట్లో జరిగిన పలు విషయాలను గుర్తు తెచ్చుకున్నారు.

# రైతు భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి లక్ష్యం



- మూడు తరాల రైతుల కష్టాలకు నేటితో తెర



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** రైతు భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కాకుండా వారిని మరింతగా ఆదుకోవాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం ఈ ప్రాంతానికి చెందిన 322 మంది రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతిరెడ్డిపాలెం గ్రామంలో మూడు తరాలుగా కొందరు రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు లేక ఇబ్బందులు పడడం బాధాకరమన్నారు. డెల్టా ప్రాంతంలో నెల్లూరుకు సమీపంలో ఉన్న ఈ గ్రామంలో ఇటువంటి సమస్యలు గత సంవత్సరాలుగా కొనసాగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుర్తించి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు భరోసా కల్పించిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయడమే కాకుండా ఈ నెల 22న తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలో జమ అవుతాయన్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలో 770 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. అదేవిధంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో వెయ్యి మందికి పైగా 10 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు. 30 సంవత్సరాలుగా పరిష్కారం కాని కిసాన్ సెజ్ సమస్యను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేశామన్నారు. ఇప్పుడు ఆ కిసాన్ సెజ్‌లో 15 వేల కోట్లతో పెట్టుబడులు రానున్నాయన్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ నేత్ర సేవలను ప్రజలకు అందిస్తున్నామని, అవసరమైన వారికి కూడా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామ దత్తత నాయకుల ఆధ్వర్యంలో భారీ పూలమాలలతో సత్కరించారు. అనంతరం 322 పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, మాజీ సర్పంచ్ వాణి, అమరావతి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్,పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలు బాల రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రసాద్, ఆదిశేషారెడ్డి, జహంగీర్, సాధిక్, మురళి, తదితరులు ఉన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి



**నెల్లూరు, జూలై 17, ప్రభాతవార్త – కలెక్టరేట్** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో డీఆర్వో విజయ్ కుమార్‌తో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్‌ను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను ఓపికగా ఆలకించిన కలెక్టర్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్‌లో అందిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామనిచెప్పారు. ఈ కార్యక్ర మంలో వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతనే ఉంది. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఇద్దరికి ట్రై సైకిళ్లను అందజేశారు. మధుమేహం కారణంగా కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితి తెలుసుకున్న వేమిరెడ్డి దంపతులు వారి కదలికలకు ఆసరాగా ట్రై సైకిళ్లు పంపిణీ చేసి మరో సారి తమ సేవా దృక్పదాన్ని చాటుకున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1040 మంది దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు పంపిణీ చేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. శుక్రవారం ట్రై సైకిళ్లు అందుకున్న వారిలో కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం రామాయపట్నం గ్రామానికి చెందిన పంతంగి శ్రీనివాసులు, ఉదయగిరికి చెందిన ఎన్. రామయ్యలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చంద్రబాబు రైతు వ్యతిరేకి కాకాణి



**నెల్లూరు, జూలై 17, ప్రభాతవార్త** చంద్రబాబు రైతు వ్యతిరేకి అని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం ప్రకాశం జిల్లా, ఒంగోలు నగరంలోని కలెక్టర్ ఆఫీసు ఎదురుగా దర్శి శాసనసభ్యులు, ప్రకాశం జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొగాకు రైతులకు అండగా పొగాకు రైతు దీక్ష నిరసన కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు వెంకాయమ్మ, మాజీ మంత్రులు ఆదిమూలం సురేష్, మేరుగ నాగార్జున, మాజీ శాసన సభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి, నియోజకవర్గాల ఇంచార్జిలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, రైతు సంఘాల నాయకులతో కలిసి నిరసన దీక్షలో పాల్గొని పొగాకు రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలుకు విచ్చేసిన మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డికి ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతు సోదరులు ఆత్మీయ స్వాగతం పలికారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి జగన్ పాలనలో రైతులకు అనుకూలంగా వ్యవసాయ అభివృద్ధికి తీసుకున్న సానుకూల నిర్ణయాలు, నేటి చంద్రబాబు ప్రభుత్వంలో అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను, క్షుణ్ణంగా పూసగుచ్చినట్లు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దిగిపోయి, చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయన్నారు.ప్రస్తుత పాలకుల వల్ల రైతులు తమ సమస్యలపై మరలా రోడ్ల మీదకు వచ్చి పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులు పండించిన పంటలకు ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించడం లేదని, గిట్టుబాటు ధర కల్పించాలంటూ పొగాకు రైతులు అనేక రకాలుగా నిరసనలు తెలియజేస్తూ, ర్యాలీలు నిర్వహిస్తూ, ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా, వారికి ఆత్మహత్యలే శరణ్యమయ్యేలా చంద్రబాబు ప్రవర్తిస్తున్నారా అని అనుమానం కలుగుతుందన్నారు.పొగాకు రైతుల సమస్యలపై గురువారం కనిగిరి నియోజకవర్గంలో శాసనసభ్యులు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారన్నారు. నేడు ఒంగోలులో కూడా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఇతర సంబంధిత నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పొగాకు రైతులకు మద్దతు తెలుపుతున్నారని తెలియజేశారు. పొగాకు రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో ఈ నిరసనలు కొనసాగుతున్నాయన్నారు.పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లభించకుండా దళారులు, మధ్యవర్తులు దోచుకుంటున్నారని, ప్రభుత్వం తమను కాపాడాలని రైతులు కోరుతున్నారని పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు ఎక్కడికక్కడే వ్యాపారస్తులతో చేతులు కలిపి (రింగ్ అయి) రైతుల నడ్డి విరుస్తున్నారే తప్ప, పొగాకు రైతుల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.తాను స్వయంగా కందుకూరు పొగాకు బోర్డుకు వెళ్లినప్పుడు తాము ఉన్నంత సేపు ఒక రేటు ఇచ్చి, తాము బయటకు రాగానే రేటు తగ్గించారన్నారు.అధికారులు వేలం పాట నిర్వహించే వ్యాపారస్తులకు ముందే సమాచారం అందించి తమ వారికి అధిక రేట్లుపడేలా (ఇన్ఫ్లుయెన్స్ చేసి), తమకు నచ్చిన విధంగా రేట్లను తగ్గిస్తూ,ఎక్కిస్తూ ఇష్టారాజ్యంగా మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. కందుకూరులో మొదట క్వింటాలు 26 వేల రూపాయలకు పొగాకు కొనుగోలు చేసిన జేకే సిగరెట్ కంపెనీ ప్రతినిధులను మరుసటి రోజుకల్లా రాకుండాచేసి, ఆ ధరను ఒక్కసారిగా 16 వేల రూపాయలకు తగ్గించారన్నారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో క్వింటాల్ 31వేల నుండి 36 వేల రూపాయలకు పొగాకు కొనుగోలు చేస్తే,ఇక్కడ మాత్రం క్వింటాలుకు 15,900 నుంచి 16,000 రూపాయలకు మించి ఇవ్వడం లేదన్నారు.చంద్రబాబు నాయుడు ఆలోచన అంతా రైతు వ్యతిరేక విధానమే అని, ఆయనకు రైతులన్నా, వ్యవసాయమన్నా అస్సలు గిట్టదన్నారు.అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు రైతుల ప్రయోజనాలతో పనిలేదన్నారు. ఆయనకు కేవలం తన సొంత, స్వార్థ ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం అని తెలిపారు.అమరావతిని బంగారు బాతులా మార్చుకుని, రైతుల దగ్గర నుంచి భూములు లాక్కొని, వారి ఆత్మహత్యలకు, గుండెపోట్లకు చంద్రబాబు కారకుడవుతున్నారని ఆరోపించారు.రాజధాని నిర్మాణం పేరిట ఒక్కొక్క చదరపు అడుగుకు 22,000 రూపాయలకు టెండర్లు పిలిచి, టెండర్లు పొందిన కాంట్రాక్టర్ల దగ్గర నుండి అమ్యామ్యాలు వసూలు చేస్తున్నాడని తెలిపారు.ప్రభుత్వ ధనమంతా కాజేస్తూ, అప్పులు తీసుకువచ్చి, రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చేసి, కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టి దోచుకుంటున్నారని విమర్శించ్చారు. ఒకపక్క లోకేష్ తనకు సంబంధించిన వారికి 99 పైసలకు భూములు అమ్మేస్తూ, మరోపక్క తన తోడల్లుడికి చెందిన గీతం యూనివర్సిటీకి 5 వేల కోట్ల విలువైన భూములను అప్పనంగా అప్పగించారన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఎన్నో కష్టనష్టాలు ఓర్చి రామాయపట్నం పోర్టును తీసుకువస్తే 5000 కోట్ల విలువైన ఆ పోర్టును కేవలం 1500 కోట్ల రూపాయలకే దోచిపెడుతూ, అదనంగా భూమి కావాలంటూ నోటిఫికేషన్ జారీ చేసి,అదనపు దోపిడీకి పాల్పడుతున్నాడన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆలోచన విధానమంతా రైతులను అడ్డు పెట్టుకుని ఏ విధంగా దోచుకోవాలనేదే తప్ప, రైతులకు అండగా నిలవాలనే ఆలోచన లేదని అవహేళన చేశారు.లోకేష్ కి సవాల్ విసురుతున్నానని, తాను ఐదు రకాల పంటలు చూపిస్తా, వాటి పేర్లు లోకేష్ చెప్పగలిగితే తాను శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకుంటామన్నారు.కనీసం పంటల పేర్లు కూడా తెలియని లోకేష్ లాంటి వారు వ్యవసాయం గురించి మాట్లాడటం సరికాదన్నారు.రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని జగన్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు.సాధారణంగా పంటల బీమాలో ఒక వంతు రైతులు, ఒక వంతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద కేంద్ర ప్రభుత్వం, మిగిలిన ఒక వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందన్నారు. రైతులు కట్టాల్సిన ప్రీమియం వాటాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాను కూడా జగన్ హయాంలో ఏపీ ప్రభుత్వమే పూర్తిగా భరించి, రైతులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించిందన్నారు. కేంద్ర పథకం కేవలం వెబ్ ల్యాండ్‌లో నమోదైన రైతులకు మాత్రమే బీమా వర్తింపజేస్తుందన్నారు. దీనివల్ల కౌలు రైతులు, ఇతర సాగుదారులు నష్టపోతారన్నారు. ఈ పరిమితుల కారణంగా కేంద్ర పథకం నుండి బయటకు వచ్చి, రాష్ట్రంలోని కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు లబ్ధి చేకూర్చేలా నాటి జగన్ ప్రభుత్వమే పూర్తిగా 100 శాతం ప్రీమియం చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసిందన్నారు.ఇలా పూర్తి ప్రీమియం భరించిన ఏకైక ముఖ్యమంత్రి మన దేశంలో జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. రైతు దేశానికి ప్రాణనాడి, జీవనాడి అని మహానేత రాజశేఖర్ రెడ్డి భావిస్తే, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని జగన్ మోహన్ రెడ్డి ఆలోచించారన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంటలకు గిట్టుబాటు ధర ఉండేది , సిఎం ద్వారా ప్రతి రోజూ ధరలను పర్యవేక్షించేవారని, మార్కెట్‌లో పంటలకు కనీసమద్దతు ధర కంటే తక్కువ వస్తే, వెంటనే మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా 3,000 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధితో రైతులను ఆదుకున్నారన్నారు. కానీ ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ప్రతిదానికి కేంద్రంపై నెపం నెడుతు, కేంద్రానికి లేఖలు రాయడం, చేతులు దులుపుకోవడం చేస్తున్నారే తప్ప, రైతులను ఆదుకోవాలని చూడటం లేదన్నారు.కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తో సహా ఎక్కడికక్కడ ధరలు మార్కెట్లో పెరిగిపోయాయని, రైతులకు మాత్రం గిట్టుబాటు ధర రావడంలేదన్నారు.రైతుల సమస్యలపై చంద్రబాబు మాట్లాడుతూ వరి ఎవరు తింటారు? యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుంది అంటూ రకరకాల మాటలు మాట్లాడుతున్నారన్నారు.

కనీసం చంద్రబాబు తినే పెసలు, మినుములు లాంటి చిరు ధాన్యాలకు కూడా మార్కెట్లో సరైన ధర లేదని,రైతులు శ్రమించి పండించే ఏపంటకు కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు.చంద్రబాబు నాయుడు పూర్తిగా రైతు వ్యతిరేకి, రైతుల సమస్యలు పట్టించుకోకుండా రైతుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు.ఒంగోలులో సోదరుడు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులందరినీ సమీకరించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.చంద్రబాబు మెడలు వంచి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చైనా సరే రైతులకు అండగా నిలుస్తామని,ప్రస్తుత పొగాకు పంట అమ్మకాల సీజన్ దాదాపుగా పూర్తి కావస్తోంది, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం వెంటనేపొగాకు కొనుగోళ్లు చేపట్టాలని,సీజన్ దాటిపోయే వరకు చంద్రబాబు కాలయాపన చేసి, ఆ తర్వాత మళ్ళీ కొత్త కొత్త అబద్ధాలు చెప్తారని పేర్కొన్నారు.

చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలు, రాష్ట్రంలో ఎక్కడ చూసినా రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు.ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు.ప్రభుత్వ తీరు వల్ల నేడు రైతులందరూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతులు రోడ్డెక్కడం అనేది ప్రభుత్వానికి అరిష్టం, కూటమి ప్రభుత్వం బంగాళాఖాతంలో కొట్టుకుపోతుందనడానికి ఇది నిదర్శనమన్నారు.చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉన్నటువంటి భాగస్వామ్య పక్షాలన్నీ కూడా కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు.తామంతా తప్పనిసరిగా రైతుల పక్షాన నిలబడతామని, రాష్ట్రంలో ఉన్న రైతాంగానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రత్యేకించి ప్రస్తుతం సమస్యలు ఎదుర్కొంటున్న పొగాకు రైతులకు అండగా నిలబడాలనే ఆలోచనతో రైతులతో కలసి నడుస్తున్నామన్నారు.రైతులకు అండగా ఉండటమే కాకుండా, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోకపోతే రాబోయే రోజుల్లో మా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దీంతో కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రసంగానికి రైతుల నుండి అనూహ్య స్పందన లభించింది.

## ప్రజల సమస్యల పరిష్కారమే మా బాధ్యత - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, జూలై 17, ప్రభాతవార్త** కోవూరు నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చే ప్రతి విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి, వా టిని వీలైనంత త్వరగా పరిష్కరించడమే తమ ధ్యేయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశా రు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలను ఆమె స్వయంగా కలిసి, వారి సమస్యలను అడిగి తెలు సుకుంటూ వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు ప్రధానంగా తమ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మాణం, నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు, అలాగే స్థానిక ఆలయాల నిర్మాణం పనులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో వీలైనంత వేగంగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని ప్రశాంతి రెడ్డి సూచించారు.

## అన్నదాతకు మరింత భరోసా టిడిపి నాయకుడు జలీల్ ఆహ్మాద్



**కోట,జులై 17 ప్రభాతవార్త** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతులు.స్వయం సహాయక సంఘాలు మహిళలు,ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు యువత, చిరు వ్యాపారులు,విభిన్న వర్గాల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్.జలీల్‌ఆహ్మాద్ అన్నారు. ఒకప్పుడు వ్యవసాయం కాడెడ్లకు పూజలు చేసి అరక చేతపట్టి ఏరువాకతో ప్రారంభమయ్యేది కాలం మారుతున్న కొద్దీ వ్యవసాయ రంగంలో అనేక మూర్పులు వస్తున్నాయని జలీల్ ఆహ్మాద్ పెర్కొన్నారు.. శుక్రవారం కోటలోని సచివాలయంలో రైతులకు సబ్సిడీతో జిలగలను ఆయన చేతుల మీదగా పంపిణి చేశా రు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ వైపు దృష్టి సారిం చాలన్నారు. చాల పనులకు ఆధునిక యంత్రాలు పరికరాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. సన్న ,చిన్న కారు రైతులు సైతం సాగులో యంత్రాలను వినియోగిస్తున్నారని చెప్పారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు.జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ 4.14 కోట్లతో యంత్రాపరికరాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లు, రోటావేటర్లు, కలుపుతీత యంత్రాలు అయిల్ ఇంజిన్లు డ్రిప్ పరికరాలు కావల్సిన రైతులకు వ్యక్తిగతంగా ప్రభుత్వం మంజారు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.సుచ్చేంద్ర ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి.ఎంపిటిసీలు షంషద్దీన్,దారా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ అభివృద్ధి పనుల పరిశీలనలో సిడిఎంఏ



**నెల్లూరు కార్పోరేషన్, జులై 17 ప్రభాతవార్త :** కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాకటర్ సంపత్‌కుమార్ నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ వైఓ.నందన్‌తో కలసి స్థానిక 52వ డివిజన్ రగనాయకులపేట ప్రాంతంలోని పినాకిని పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. పార్కులో జరుగుతున్న వివిధ రకాల సివిల్ వర్క్స్ పనులను సిడిఎంఏ, కమిషనర్‌లు తనిఖీ చేసి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నిర్దేశించిన సమయంలోగా పార్కులో అభివృద్ధ పనులు అన్నింటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ చంద్రయ్య, డిఈ రఘురాం, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

**స్మార్ట్ స్ట్రీట్ బజార్ నిర్వహణపై తనిఖీ :-**

నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పర్యవేక్షణలోభాగంగా కమిషనర్ వై.ఓనందన్‌తో కలిసి స్థానిక జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతంలోని స్మార్ట్ స్ట్రీట్ బజార్ నిర్వహణ తీరును తనిఖీ చేశారు. వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు, తాగునీరు, వసతిషాపుల నిర్వహణ తదితర వ్యవహారాలను సిడిఎంఎ, కమిషనర్‌లు పరిశీలించి నిర్వాహకులకు వివిధ సూచనలను జారీ చేశారు. అనంతరం స్థానిక దొంతాలి డంపింగ్‌యార్డు నిర్వహన పనితీరును ఇంజనీరింగ్ అధికారులతో కలసి వారు పరిశీలించారు. దొంతాలి డంపింగ్‌యార్డులో జరుగుతున్న వ్యర్థాల రీసైక్లింగ్ పనులను పర్యవేక్షించిన సిడిఎంఎ, కమిషనర్‌లు ఆధునిక రీసైక్లింగ్ పద్దతి ద్వారా సమయానుకూలంగా పూర్తి స్థాయిలో వ్యవర్థాలను నిర్మూలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ మహేష్, ఈఈ గిరిధర్, డిఈఈ జానకిరామ్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ, చంద్రయ్య, అనిల్‌కుమార్, డిఈలు రఘురాం, ముజాహిద్దీన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణలో సిడిఎంఎ, కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జులై 17 ప్రభాతవార్త :** కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సంపత్‌కుమార్ నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ వైఓ.నందన్‌తో కలసి స్తానిక పొదలకూరు రోడ్డు, డైకాస్‌రోడ్డు సమీపంలోని అన్నా క్యాంటిన్‌ను శుక్రవారం సందర్శించారు. అన్నా క్యాంటిన్‌లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను వారు తనిఖీ చేశారు. క్యాంటిన్‌కు విచ్చేసిన ప్రజలతో సిడిఎంఎ కమిషనర్‌లు ప్రత్యక్షంగా మాట్లాడి ఆహార నాణ్యతను, నిర్వాహకుల వ్యవహారా శైలిని అడిగి తెలుసుకొన్నారు. క్యాంటిన్ ప్రాంగణంలో తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహన తీరును పరిశీలించారు. క్యాంటిన్ పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహన తప్పనిసరిగా పాటిస్తూ నిర్దేశించిన ప్రమాణాలను క్యాంటిన్ నిర్వాహకులు చేపట్టాలని కమిషనర్ సూచించాచు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నా క్యాంటిన్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** పట్టణంలోని అన్నా క్యాంటిన్‌ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్నా క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న వారిని ఆహారం నాణ్యతపై విచారించి పరిశుభ్రతపై ఆరా తీశారు. అక్కడి పరిసర ప్రాంతాలను పరిశుభ్రతపై తనిఖీ చేయడం జరిగింది. పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. టిడిపి సీనియర్ నాయుకులు అన్నా క్యాంటిన్ ఛైర్మెన్ తిరివీధి ప్రసాద్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు యవు నాయకులు నారా లోకేష్‌బాబులు ప్రతిష్టాత్మకంగా పేదలకు రూ.5లకే భోజనాన్ని అందింస్తుండడం సంతోషకరమన్నారు. వివిధ పనుల నిమిత్తం కావలికి వచ్చే వారికి అన్నాక్యాంటిన్‌లో అసౌకర్యాలు కలగకుండా తృప్తిగా భోజనం చేసి వెళ్ళేందుకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పేదవాడు ఆకలితో భాదపడకుండా కడుపారా తినాలన్న లక్ష్యంతో క్యాంటిన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ సాయిరాం, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మైరా యాప్ ద్వారా జమా ఖర్చులు తెలుసుకోవచ్చు



**బుచ్చి జులై 17 ప్రభాతవార్త :** మెప్మా ద్వారా నిర్వహిస్తున్న " మన డబ్బులు- మనలెక్కలు " కార్యక్రమాన్ని ఇస్కపాళెం సమైక్య-1లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిఒచారు. మెప్మా ఎం.డి కరుణకుమారి, మెప్మా పి.డి కిరణ్‌కుమార్, ఆదేశాలతో ఐబి అంకయ్య,సిఒ నర్మద నేతృత్వంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిఒ నర్మద మాట్లాడుతు పొదుపు గ్రూప్ లో ఉన్న డబ్బులు జమా,ఖర్చులు, ప్రతి సభ్యురాలికి డిజిటల్ (మైరా) యాప్ ద్వారా తెలుస్తుందని అన్నారు. ప్రతి మహిళ ఈ యాప్ ద్వారా జమా ఖర్చులు తెలుసుకోవచ్చునని అన్నారు. ప్రతి పొదుపు మహిళ ఈ యాప్ వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎల్ఎఫ్ అద్యక్షురాలు పి.ఈశ్వరమ్మ, కార్యదర్శి ఎస్‌కె ఖాదర్‌భీ, కోశాధికారి ఎస్‌కె సోనియా, ఆర్‌పి ఎస్‌కె సుభానీ, టిఎల్ఎఫ్ ఆర్‌పి కిరణ్మయి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గోన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన మలిశెట్టి మన్నవ



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన అబ్దుల్‌రషీద్‌ను శుక్రవారం టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు మనవ రవిచంద్రలు కలిసి పూలబొకే అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు, ఇతర సమస్యలు తలెత్తకుండా పరిష్కరంచాలని కమిషనర్‌ను కోరారు. పట్టణానికి శివారు ప్రాంతాలైన ఎస్‌సి, ఎస్‌టి కాలనీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అంతేకాకుండా మున్సిపల్‌లో జరిగే వివిధ పనులను క్షణ్ణంగా పరిపీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిరణ్‌కుమార్, రమణయ్య, కొమర రమణయ్య, శ్రీనివాసులు, టిడిపి నాయకులు ప్రసాద్. మనోహర్ యాదవ్, శివకుమార్, సుందర్, ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

## షైనింగ్‌స్టార్ జాబితాలో విశ్వం విద్యార్థులు ఎంపిక



**కలువాయి జులై 17 ప్రభాతవార్త :** ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్‌జాబితలో మండల నుండి ఆరు మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో విశ్వం హైస్కూల్‌కి చెందిన 4 గురు విద్యార్థులకు చోటు దక్కింది. పదో తరగతిలో 6 వందలకు 592 అత్యధిక మార్కులు సాధించిన జె హెచ్ సాయిరాం, అదే విధంగా బి శృతికి 591, కె.పి చరణ్‌రెడ్డి 591, ఎం వెంకట అకిల్ 586 మార్కులు సాధించి గుర్తింపు పొందారు. విశ్వం విద్యా సంస్థలలో విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలలో వారి ప్రత్యేకతను చాటుకోవడంతో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని అభినందించారు.

## ఇంటర్ ఎస్‌సి విద్యార్థులు బ్యాంకు ఖాతా తెరిపించుకోవాలి

**కావలి, జులై 17 ప్రభాతవార్త :** 2026-27 విద్యాసంవత్సరానికి గానూ తల్లికివందనం నిధులను ఈనెల 22న ప్రభుత్వం విడుదల చేయనున్నదని ఇందుకు సంబంధించిన విద్యార్థులు బ్యాంకు, పోస్టాఫీసుల్లో అకౌంట్‌లను ఓపెన్ చేసుకొని వాటికి సంబందజంచిన ఎన్‌పిపిఐ లింకు చేయించుకోవాలని తెలిపారు. కావలి సహాయ సాంఘీక సంక్షేమ అధికారి జి.వెంకట్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులను బ్యాంకు ఖాతాలకు ఎన్‌పిపిఐ లింకు చేసుకొన్న వారు బ్యాంకు అధికారులను సంప్రదించి లింకును చేయించుకోవాలని తెలిపారు. ఇంతవరకు ఖాతాలు లేని వారు వెంటనే నూతన అకౌంట్‌లను తెరవాల్సిందిగా ఆయన తెలిపారు. దీనిపై సచివాలయ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయంలోని లేదా 9182121723, 9440689260నెంబర్స్‌ను సంప్రదించాలని కోరారు.

## రత్నం స్కూల్ షైనింగ్ స్టార్ పి.వైష్ణవి




**బుచ్చి జులై 17 ప్రభాతవార్త :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్ధిని విద్యార్థులనుప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్‌స్టార్ అవార్డు 2026లను ప్రకటించడం జరిగింది. ఇందులో బుచ్చిరెడ్డిపాళెం రత్నం స్కూల్ నందు 592 మార్కులతో ప్రతిభ కనబరచిన పి.వైష్ణవికి ఈ అవార్డు రావడం జరిగిందిజ ఈఅవార్డు ఈనెల 20 వ తేది సోమవారం నాడు నెల్లూరు నందలి కస్తూరిబాబా కళాక్షేత్రం నందు ఉదయం 9 గంటలకు ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా రత్నం స్కూల్ డైరక్టర్ సిహెచ్ మల్లికార్జునరావు,ప్రిన్సిఫల్ వినయ్‌తేజ,పిఇటిలు మహేష్, గౌస్ మరియు స్కూల్ ఉపాధ్యాయని ఉపాధ్యాయులు వైష్ణవి ని అభినందించారు.

## ఆర్టీసి బస్టాండులో ఆయూష్‌శాఖ ఆయుర్వేద వైద్యశిబిరం



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** స్థానిక ఆర్టీసి బస్టాండులో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం డిపో మేనేజర్ ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి జోన్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచనల మేరకు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆశాఖ వైద్యులు హాలీ మౌలాలి మాట్లాడుతూ దీర్ఘకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందు లబిస్తుందని తెలిపారు. కావున ప్రతి ఆర్టీసి కార్మికులు ఈ శిబారాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో దాదాపు 200మందికిపైగా ప్రయాణీకులు, కార్మికులు పాల్గొని మందులను ఉచితంగా పొందారు. ఈ శిబిరంలో డాక్టర్లు రాజ నరసింహా, శ్రీరేఖ, రోహిణీలు పాల్గొన్నారు.

## ఇది ఇంతేనా..



**ఉదయగిరి, జులై 17, ప్రభాతవార్త :** డైరీలోని బాలాజీ నగర్ ట్యాంకు బండ్ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత లోతులో ఉంది. వర్షాకాలం వస్తే దాని వల్ల ఇబ్బంది తప్పదని ఈ ట్రాన్స్‌ఫర్ పరిస్థితి ఇంతేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులో ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం లోతులో ఉండడం విశేషం. గతంలో పెన్షన్ లేకుండా ఉండడంతో మూగ జంతవులు మనుషులు సైతం ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితులు ఎదురయ్యాయి. స్పందించిన విద్యుత్ శాఖ ఫెన్సింగ్ వేసింది. ఇప్పుడు లోతుగా వెళ్లిపోయి ఉండడంతో వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి భిన్నంగా ఉంటుందని స్థానికులు భయపడుతున్నారు. తదితరులు స్పందించి ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకు మార్చాలని కోరుతున్నారు.

## చెక్ డ్యామ్ బద్దలు కొట్టారు



**ఉదయగిరి, జులై 17, ప్రభాతవార్త :** ఉదయగిరిలోని పెద్ద చెరువుకు కింద వైపున ఉన్న లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్ ను బద్దలు కొట్టారు. అధికారుల అనుమతి లేకుండా అడ్డగోలుగా బద్దలు కొట్టడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు మూగ జంతువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయల ఖర్చుతో ఈ చిన్న పాటి చెక్ డ్యామ్‌లను నిర్మించింది. అయితే కొందరు తమ బాధ్యత మరిచి తమ స్వార్థం కోసం వీటిని బద్దలు కొట్టడం న్యాయమా అంటూ ప్రశ్నిస్తున్నారు. పొలానికి నీళ్లు కావాల్సి వస్తే సంబందిత అధికారులను సంప్రదిస్తే ఆస్తి నష్టం తెలియకుండా నీరు అందే విధంగా అధికారులే చొరువ తీసుకొని నీరు అందిస్తారని అలా కాకుండా ఇష్టారాజ్యంగా బద్దలు కొట్టడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి వర్షాకాలం లోపు మరమ్మత్తులు చేపట్టాలని బద్దలు కొట్టిన వాడికి నోటీసులు ఇచ్చి హెచ్చరికలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

## వాంగ్‌చుక్ ఆమరణ నిరాహారదీక్షకు సిపిఐ సంఘీభావం



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ రామ్‌మెగాసేస్ అవార్డు గ్రహీత పర్యావరణ వేత్త వాంగ్ చుక్ అమరణ దీక్షకు స్థానిక సిపిఐ, ఏఐటియుసి నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో డాక్టర్ బిఆర్,అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిపిఐ నాయకులు బిల్లా పురుషోత్తం, ఏఐయూసి అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు కోసం విద్యారంగంలో అవినీతి నీట్ ప్రశ్నాపత్రాల లీకసి అక్రమాలు 23మంది విద్యార్థులు మృతికి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర రాజీనామా చేయాలని కాక్రోచ్ జనాతాపార్టీ డిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిందన్నారు. ఇందకు సంఘీభావంగా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారని తెలిపారు. మోడీ పాలన నిద్రావస్థలో ఉందన్నారు. ప్రభత్వం విద్యార్థులు వాంగ్‌చుక్ ఆందోళనను ఆలకించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మల్లిఅంకయ్య, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శి ఏండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంటకేష్, సిపిఐ డివిజన్ సహాయ కార్యదర్శి దుర్గాబాయి, యేసు, పెంచులయ్య, ఎం.సుధాకర్, వై. ప్రభావతి, కామాక్షి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మెజిషీయన్ మాధవరావుకు నాబార్డు అవార్డు

**కావలి, జులై 17 ప్రభాతవార్త :** కావలి వాస్తవ్యులు, ప్రముఖ ఇంద్రజాలికులు కళారత్న వేములపాటి మాధవరావు తెలంగాణ రాష్ట్ర నాబార్డు అవార్డును అందుకోవడం జరిగింది. నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ పర్ రూరల్ డెవలప్‌మెంటు అండ్ రూరల్ వాటర్ సప్లై దాన కిషోర్ పాల్గొని మాట్లాడారు. గత 12ఏళ్ళుగా వందలాది ప్రదర్శనలు ఇచ్చి గిరిజన ప్రాంత ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతులు చేయడం, నీటి పొదుపు భూగర్భ జలాల పెంపు, వాటర్‌షెడ్స్, సంరక్షణ, అడవుల సంరక్షణ వంటి అంశాల గురించి అవగాహన కల్పించడంలో మాధవరావు చేసిన కృషి చేలా గొప్పదన్నారు. ఆయా అంశాలను అవగాహణ కల్పించడంలో మాధవరావు చేసిన ప్రయోగాలు మేధావులను సైతం ఆశ్యరంకు గురిచేశాయన్నారు. ఈ సందర్భంగా పలువరు పట్టణ ప్రముఖులు మాధవరావును అభినందించారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ వ్యక్తి మృతి



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** బైకును మరోక బైకు వెనుకనుండి ఢీ కొనడంతో స్థానిక వెంగళరావుకునగర్‌కు చెందిన ఆరుమళ్ళ దేవమణినాయుడు(60) మృతి చెందిన సంఘటన శుక్రవారం కావలిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఆరుమళ్ళ దేవమణి నాయుఉ బాలాజి కాటా వద్దకు వెళ్ళాలని పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకవైపు నుంచి మరో బైక్‌పై వస్తున్న బెల్లంకొండ దనుష్, కత్తి యోగేంద్రలు ముందు వెలుతున్న మోటారు బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో దేవమణి నాయుడు కిందపడడంతో తలకు తీవ్రగాయం అయింది దీంతో 108లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కావలి వన్‌టౌన్ ఎస్ఐ సుమన్ కేసు నమాదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.లక్ష విరాళం ప్రకటించిన మద్దుల నరసింహారావు



**కావలి, జులై 17 ప్రభాతవార్త :** కావలి రెడ్‌క్రాస్‌లో గత తలసేమియా వారియర్‌ని ఒకరిని ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ వస్త్ర వ్యాపారి మద్దుల వెంకట నరసింహారావు దత్తత తీసుకొని లక్ష రుపాయలు విరాళాన్ని ప్రకటించారు. అనంతరం ఐదుమంది తలసేమియా వారియర్స్‌కుబ్లడ్‌ట్రాన్స్‌లేషన్ చేసి వారికి ఆరోగ్యకరమైన డ్రైఫ్రూట్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ నరేంద్ర రమ్యదీపిక దంపతులు పాల్గొని నరసింహారావుని శాలువాలతో ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యఓఉలు డాక్టర్ బెజవాడ రవికుమార్, ఛైర్మెన్ రవిప్రకాస్, వైస్‌ఛైర్మెన్ హరినాథ్‌రెడ్డి, తలసేమియా ఇన్‌చార్జ్ డాక్టర్ పామూరు శ్రీధర్, అడహక్ కమిటీ సభ్యులు పాదర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు భారతీయ మజ్దూర్ సంఘ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



**నెల్లూరు అగ్రికల్చర్ జులై 17 ప్రభాతవార్త :** నెల్లూరులోని మినీ బైపాస్‌లో ఉన్న జిపిఆర్ కళ్యాణ మండపంలో భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్మార్ట్ పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను జోడించండి




**నెల్లూరు క్రైం, జులై 17, ప్రభాతవార్త:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు పోలీసు యంత్రాంగం ఆధునిక సాంకేతికతను ఆయుధంగా మలచుకోవాలని ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె స్మార్ట్ పోలీసింగ్ అమలుపై దిశానిర్దేశం చేశారు. పోలీసింగ్ వ్యవస్థలో మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా సిసిటిఎన్ఎస్, ఈ కోడ్స్, టాబ్స్, ఈ సాక్ష్య, సీసీ టీవీ 360 యాప్ మరియు డ్రోన్ టెక్నాలజీని పూర్తిస్థాయిలో వాడాలని ఆమె సూచించారు. వీటిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా నేరస్తుల గుర్తింపు, మిస్సింగ్ కేసుల ఛేదన, ఆస్తి నేరాల గుర్తింపు, వాహనాల అన్వేషణ ప్రక్రియలో త్వరితగతిన ఫలితాలు సాధించవచ్చని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పీపీపీ పద్ధతిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ కోరారు. సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించడం ద్వారా నేరాలను అడ్డుకోవడమే కాకుండా, ప్రజల్లో భరోసా కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పనితీరును కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారంగా సమీక్షిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తు వేగం, ప్రజా సమస్యలపై స్పందన సమయం, సేవల నాణ్యతలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని హెచ్చరించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రాధాన్యతని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎస్‌డీపీఓలు, సీఐలు, ఎస్ఐలు, ఎస్‌బీ, సైబర్ వింగ్, డీసీఆర్బీ మరియు ట్రాఫిక్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా యూనిట్ నూతన కమిటీ ఎంపిక



**ఆత్మకూరు,జులై17,ప్రభాతవార్త:** ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా యూనిట్‌లో ఖాళీగా ఉన్న అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్ష, జాయింట్ సెక్రటరీ పదవులకు కో-ఆప్షన్ విధానంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఆత్మకూరు ఇరిగేషన్ కాంపౌండ్ లో నిర్వహించిన ఈ కో-ఆప్షన్ ప్రక్రియ ఎన్నికల్లో తాలూకా అధ్యక్షుడిగా ఆర్.వెంకటసుబ్బయ్య (ఇరిగేషన్), తాలూకా కార్యదర్శిగా ఎస్.కె.షఫి(మెడికల్), ఉపాధ్యక్షులుగా ఎ.శివయ్య(ఇరిగేషన్), జాయింట్ సెక్రటరీగా ఎస్.కె.శంషాద్‌బేగంలు ఏకగ్రీవంగాఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు జిల్లా ఉపాధ్యక్షుడు టి.మల్లిఖార్జునరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి కో-ఆప్షన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్ఎస్ బి.శ్రీనివాసులురెడ్డి, అనంతపురం డియస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలను ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు , జిల్లా జెఎసి ఛైర్మెన్ బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, జిల్లా సోసియేట్ అధ్యక్షులు ఎస్.ఆంజనేయవర్మ, పొదలకూరు తాలూకా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ఉదయగిరి తాలూకా అధ్యక్షుడు షేక్ రియాజ్, నెల్లూరు తాలూకా కార్యదర్శి ఎ.వి.కృష్ణకుమార్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సంఘం బలోపేతానికి, ఉద్యోగుల సంక్షేమానికి నూతన కమిటి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు కోరారు.

## పేపర్ ప్లేట్లలో వేడి ఆహారం తింటే అనారోగ్య సమస్యలు వస్తాయి




**ఉదయగిరి, జులై 17, ప్రభాతవార్త :** పేపర్ ప్లేట్లలో వేడి వేడి ఆహారం తీసుకోవడం వల్ల మైక్రో ప్లాస్టిక్‌కు పాలిమర్ రసాయనాలు శరీరంలోకి చేరే ప్రమాదం ఉందని గండిపాలెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకల్పన తెలిపారు. వీటి ప్రభావంతో క్యాన్సర్ హార్మోన్లు అసమతుల్యత రోగ నిరోధక శక్తి తగ్గటం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణ కోసం పేపర్ ప్లేట్లు బదులుగా విస్తర్లు అరటి ఆకులు వినియోగించాలని సూచించారు. ఇస్తరాకులలో తింటే ఆరోగ్యకరంగా ఉంటుందని ఆమె తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే సోమిరెడ్డి



**నెల్లూరు, జులై 17, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు వేదాయపాళెంలోని కార్యాలయంలో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతిపత్రాల స్వీకరించారు. పలు సమస్యలపై అప్పటి కప్పుడే ఎమ్మెల్యే సోమిరెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ చేపట్టామని వెల్లడించారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి నిర్ణీత కాలంలో పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలియజేసారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నెల్లూరు, జులై 17, ప్రభాతవార్త - వైద్యం :** 33/11కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్‌లోని 11కేవీ డిఎస్ నగర్, 11కేవీ డిఎస్ నగర్ ఇండస్ట్రియల్ ఫీడర్స్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురా నగర్, ప్రశాంతి నగర్, 3వ మైల్, రాజీవ్ గాంధీ కాలనీ, వెంగల్ రెడ్డి నగర్, సాధవారి పాలెం పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ రామ్మూర్తి నగర్ సబ్ స్టేషన్‌లోని 11కెవి ఆదిత్యనగర్ ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పినాకిని అవెన్యూ, మధురానగర్, వెలగచెట్టు సంఘం, హరనాథపురం, రాజీవగాంధీ కాలనీ, అపోలో హాస్పిటల్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్, అయోధ్య నగర్, సర్వేపల్లికాలువ కట్ట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. 33/11కేవీ ఏకె నగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి జ్యోతి నగర్ ఫీడర్ నందు మరమ్మత్తులు, చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు టీచర్స్ కాలనీ, జ్యోతి నగర్,త్యాగరాజ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. 33/11 కేవీ వైఎంసిఏ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దర్గామిట్ట ఫీడర్ కింద, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభం, మార్పిడి పనులు చేపట్టనున్నందున, ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు సోదన్ నగర్,అరవింద్ నగర్, కోర్టు పరిసర ప్రాంతాలు, ఆర్‌టిసి బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని,అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేసారు.

## పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేత



**చేజర్ల, జులై 17, ప్రభాతవార్త :** చేజర్ల గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీ నందు ఉన్న ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులందరికి విద్యా సామాగ్రి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యురాలు సోమవరపు సంగీత దాతగా గత ఆరు సంవత్సరాలు నుండి పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి అందించడం జరుగుతుంది. అనంతరం సంగీత మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించడం చాలా సంతోషకరం అని తెలిపారు. విద్యార్థులు భాగా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఇలాగే ప్రతి సంవత్సరం విద్యార్థులకు విద్యా సామాగ్రి అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, మండల టీడీపీ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్తయ్య, పాఠశాల చైర్మన్ గంగపట్ల లక్ష్మయ్య, కాలనీ వాసులు అర్జున్ కుమార్, వెంకట కృష్ణయ్య, బాబు పాల్గొన్నారు.

## నిషేధిత గడ్డి మందు అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు

**చేజర్ల, జులై 17, ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో పురుగు మందుల దుకాణాల యజమానులు నిషేధిత గడ్డి మందు అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొన్ని పురుగుమందుల షాపులలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. రెండు పురుగు మందుల దుకాణాలలో నిషేధిత గడ్డి మందు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఆ దుకాణాలకు సంబంధించి స్టాప్ సేల్స్ ఇవ్వడం కూడా జరిగిందని తెలిపారు. అయినప్పటికి నిషేధిత గడ్డి మందు అమ్మకాలు అనధికారికంగా సాగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అవసరమైతే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## జనార్ధన్‌రెడ్డిని పరామర్శిస్తున్న చేజర్ల



**ఉదయగిరి, జులై 17, ప్రభాతవార్త :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఉదయగిరికి చెందిన హోంగార్డు వాకమల్ల జనార్ధన్‌రెడ్డి కోలుకుని ఇంటికి చేరుకున్న సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల సుబ్బారెడ్డి శుక్రవారం నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పరామర్శించారు. జనార్ధన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మానవత్వానికి నిదర్శనంగా రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ సీఎం ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గౌస్ మొహమ్మద్, మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరు హరి, ఎంఎ రియాజ్ భాయ్, గానుగపెంట ఓబుల్‌రెడ్డి, చేజర్ల సుధాకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు బాలిబోయిన శ్రీనివాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


## ప్రజా క్షేమమే లక్ష్యం :తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జులై 17 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా రేషన్ డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. నాణ్యమైన బియ్యం, నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేస్తూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని, దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం మాత్రమే అందేలా చూడాలని, నాణ్యతపై ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యమిస్తూ సేవలు అందించాలని పేర్కొన్నారు. దుకాణాల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, లబ్ధిదారులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో డీలర్లు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, మండలంలోని రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛజలం..

### మళ్లీ ప్రారంభమైన మినరల్ వాటర్ ప్లాంట్



**కొడవలూరు, జులై 17 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామంలో ఎంపీ గ్రాంట్‌తో గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ఏడాదికిపైగా మరమ్మతుల కారణంగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ తీర్మానం మేరకు ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, మండల తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటు ధరలో అందించాలనే ఉద్దేశంతో ప్లాంట్‌ను పునరుద్ధరించి మళ్లీ ప్రారంభించినట్లు తెలిపారు. ప్లాంట్ నిర్వహణను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా చేపట్టి నాణ్యమైన తాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలకు 20లీటర్ల మినరల్ వాటర్ క్యాన్‌ను రూ.5కే అందించనున్నట్లు తెలిపారు. దీంతో తక్కువ ధరకే స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ప్లాంట్ పునఃప్రారంభ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు మరియు స్థానిక టిడిపి నాయకులు కరకట మల్లికార్జున్, తువ్వర ప్రవీణ్ కుమార్, మయూరి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ గ్రంథాలయాల సందర్శన



**ఉదయగిరి, జులై17, ప్రభాతవార్త :** ఉదయగిరి గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శనివారం ఉదయం 10.30గంటలకు సందర్శించడం జరుగుతుందని సమాచారం అలాగే సీతారాంపురం గ్రంథాలయాన్ని వరికుంటపాడు గ్రంథాలయాన్ని, దుత్తలూరు గ్రంథాలయాన్ని తదితర మండలాల్లోని గ్రంథాలయాలను సందర్శించడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

# బోగోలు మండలంలో ఉపాధిహామీపథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై అవినీతి ఆరోపణలు



**బిట్రగుంట జూలై 17 ప్రభాతవార్త :** బోగోలు మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులకు రాని వ్యక్తుల పేర్లతో కూడా మస్టర్ రోల్స్‌లో హాజరు నమోదు చేసి, వారు పని చేసినట్లుగా చూపించి కొంత మేర నగదు వసూలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల వారీగా ఉపాధి పనులకు హాజరుకాని వ్యక్తులను పని చేసినట్లుగా నమోదు చేసి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోపణల ప్రకారం, కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పనులకు రాని వారిని మస్టర్‌లో చేర్చి, వారి ఖాతాల్లో జమ అయ్యే మొత్తంలో కొంత భాగాన్ని నగదుగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల నిజంగా పనికి హాజరై కష్టపడే కార్మికులకు అన్యాయం జరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై మండల అధికారులను సంప్రదించినప్పటికీ, ఫిర్యాదులు పరిశీలిస్తున్నామని మాత్రమే సమాధానం ఇస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఆరోపణలు తీవ్రమైనవిగా ఉన్నప్పటికీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు సైతం ఈ కార్యకలాపాలలో ముడుపులు అందుతున్నాయి అనే విమర్శలు కూడా వెలువెత్తుతున్నాయి. బోగోలు మండలంలోని ఉపాధి హామీ పథకం పనులపై సమగ్ర విచారణ జరిపి, మస్టర్ రోల్స్‌ను పరిశీలించి, అవకతవకలకు పాల్పడిన వారిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# మైరా యాప్ ద్వారా జమా ఖర్చులు తెలుసుకోవచ్చు



**బుచ్చి జులై 17 ప్రభాతవార్త :** మెప్మా ద్వారా నిర్వహిస్తున్న " మన డబ్బులు- మనలెక్కలు " కార్యక్రమాన్ని ఇస్కపాళెం సమైక్య-1లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మెప్మా ఎం.డి కరుణకుమారి, మెప్మా పి.డి కిరణ్‌కుమార్, ఆదేశాలతో ఐబి అంకయ్య, సిఒ నర్మద నేతృత్వంలో ఈకార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈకార్యక్రమంలో సిఒ నర్మద మాట్లాడుతు పొదుపు గ్రూప్‌లో ఉన్న డబ్బులు జమా, ఖర్చులు, ప్రతి సభ్యురాలికి డిజిటల్ (మైరా) యాప్ ద్వారా తెలుస్తుందని అన్నారు. ప్రతి మహిళ ఈ యాప్ ద్వారా జమా ఖర్చులు తెలుసుకోవచ్చునని అన్నారు. ప్రతి పొదుపు మహిళ ఈ యాప్ వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ, కార్యదర్శి ఎస్‌కె ఖాదర్‌బీ, కోశాధికారి ఎస్‌కె సోనియా, ఆర్‌పి ఎస్‌కె సుభానీ, టిఎల్ఎఫ్ ఆర్‌పి కిరణ్మయి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్, కాలేజి, బస్సు డ్రైవర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి




**గూడూరు, జూలై 17, ప్రభాతవార్త :** కనీస వేతన చట్టాన్ని ప్రైవేటు స్కూల్, కాలేజి బస్సు డ్రైవర్లకు, అమలు చేయాలని శుక్రవారం గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో బస్సు డ్రైవర్లుకి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం జిల్లా కార్యదర్శి కె.సురేష్ తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో దాదాపుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు సుమారు వెయ్యి మందికి పైగా ఉన్నారని, వీళ్లకు నెలకు పదివేల నుండి 18 వేల లోపల జీతం తీసుకునే కార్మికులు ఉన్నారని, వీళ్లకు ఎటువంటి కార్మిక హక్కులు లేవని, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ సౌకర్యాలు లేవని, వేతనంతో కూడిన సెలవులు, విశ్రాంతి గదులు, మధ్యాహ్నం భోజన సదుపాయాలు లేవని, సదుపాయాలన్నీ కల్పించడానికి, ప్రతి ఒక్క డ్రైవర్ కు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. గూడూరు సి.ఐ.టి.యు కార్యదర్శి మాట్లాడుతూ డ్రైవర్‌కు నెలకు కనీసం ఒక సెలవు ఇవ్వాలని, డ్రైవర్ల పిల్లలకు ఆ స్కూలు, కాలేజీ నందు ఒకరికి ఉచిత విద్య అందజేయాలని, ఉదయం నుండి సాయంత్రంవరకు స్కూలు, కాలేజి, దగ్గర ఉండే డ్రైవర్లకు మధ్యాహ్న భోజనం, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, విద్యా సంస్థలలో ఎక్కువ బస్సులు కలిగినటువంటి యాజమాన్యం అదనంగా ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు రెండు జతలు యూనిఫారం ఇవ్వాలని, ప్రతినెల 1వ తేదీ జీతం ఇవ్వాలని పలు డిమాండ్లపై ఈనెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ఆందోళన కార్యక్రమంలో డ్రైవర్లు అందరూపాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# మరోసారి అమరావతి విద్యాసంస్థ ప్రభంజనం..!



**పొదలకూరు, జూలై 17, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డ్స్‌లో అమరావతి విద్యా సంస్థ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటు తూ ఘన విజయాన్ని సాధించారు. పొదలకూరు మండలం మొత్తం మీద ప్రకటించిన 6 షైనింగ్ స్టార్ అవార్డుల్లో ఏకంగా 3 అవార్డులను అమరావతి విద్యాసంస్థ విద్యార్థులు కైవసం చేసుకోవడం గర్వకారణం. ఇది అమరావతి విద్యాసంస్థలో అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల నిరంతర శ్రమకు నిదర్శనం. షైనింగ్ స్టార్ అవార్డ్స్ సాధించిన విద్యార్థులు ఎం. మణిదీప్ 592/600, ఎస్ సాయి మేఘన - 591/600, కె. ప్రణదీప్ - 589/600 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ముగ్గురు విద్యార్థులను అమరావతి విద్యాసంస్థ అధినేత హృదయపూర్వకంగా అభినందించారు. వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యా యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విజయం మా లక్ష్యం కాదు... విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్న అమరావతి విద్యాసంస్థ, ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఈ అపూర్వ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి, శ్రేయోభిలాషులకు అమరావతి విద్యాసంస్థ యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత




**వింజమూరు, జూలై 17, ప్రభాతవార్త:** వింజ మూరు మండలం నందిగుంట గ్రామానికి చెందిన గంగ పట్ల.అంకమ్మ నడుము నొప్పితో ఇబ్బంది పడుతూ కావలి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్య శాలలో చికిత్స పొంది నడుము ఆపరేషన్ చేయిం చుకుంది. ఇందుకు సుమారు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేసింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగపట్ల వెంగయ్య అంకమ్మ ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు దరఖాస్తుల పరిశీలించిన ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయం అధికారులు ఆమెకు 51309 రూపాయల చెక్కును సీఎం సహాయనిధి ద్వారా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి పంపారు. ఆ చెక్కును ఎమ్మెల్యే సూచనల మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంగయ్య బాధిత మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు పేద వర్గాల ఆర్థికంగా చితికి పోకూడదని ఉద్దేశంతో వారికి సీఎం సహాయ నిధి అందిస్తూ వారి కుటుంబాలలో వెలుగుల నింపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నంది గుంట కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

# షైనింగ్ స్టార్ అవార్డుకు శ్రీజ ఎంపిక



**వింజమూరు, జూలై 17, ప్రభాతవార్త :** వింజమూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థిని పాతల శ్రీజ పబ్లిక్ పరీక్షల్లోఅత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్ అవార్డు - 2026కు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రం నెల్లూరులో ఈ నెల 20వ తేదీన కస్తూరిబా కళాక్షేత్రంలో షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అవార్డులను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందజేయనున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన సుమారు 224 మంది విద్యార్థినీ విద్యార్థులకు అవార్డుతో పాటు రూ. 20 వేల నగదు పారితోషకం, సర్టిఫికెట్, మొమెంటో అందజేయనున్నారని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. విద్యార్థిని శ్రీజ సాధించిన విజయంపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి అభినందించింది.

# అంబేద్కర్ గురుకులం తనిఖీ చేసిన రాష్ట్ర కార్యదర్శి

**కోట, జులై 17 ప్రభాతవార్త :** కోటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర అంబేద్కర్ గురుకులాల ప్రత్యేక కార్యదర్శి, ప్రసన్న వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన గురుకులం ప్రాంగణంతా తిరిగి పరిసరాలను ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులను బోజన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. తరగతుల గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనాలు ఇచ్చారు.

**పాస్‌పోర్టు దారిపోయినది.**

నా పాసుపోర్టు పోయింది మువ్వా నిరూప W/o కోదండరామయ్య దగదర్తి గ్రామం (మం.) SPSR నెల్లూరు జిల్లా నందు నివసించుచున్నాను. నా పాసుపోర్టు నంబర్: M1694332 దగదర్తి గ్రామం లోని వేలుపోడు రోడ్డు సెంటర్ నందు జెరాక్స్ కోసం పొయ్యాను మార్గమధ్యలోనే పాసుపోర్టు జారి పడిపోయింది ఎవరికైనా దొరికిన యెడల తెచ్చి ఇవ్వగలరు.

**Cell : 9493580807**

# షైనింగ్ స్టార్ అవార్డ్స్‌ను కైవసం చేసుకున్న ఠాగూర్ పాఠశాల విద్యార్థులు




**అనుమసముద్రంపేట, జులై17, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన షైనింగ్‌స్టార్ అవార్డ్సులో ఓపెన్ కేటగిరిలో మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన షైనింగ్‌స్టార్ అవార్డ్సును కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామిరెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బి.సాత్విక్, పి.వి.హేమశృతి లు ఈ అవార్డులకు ఎంపికయ్యారన్నారు. ఈఅవార్డుకింద ఒక్కో విద్యార్థికి 20వేల రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెడల్ అందజేస్తారన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడం పట్ల ఠాగూరు పాఠశాల యాజమాన్యం , ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్పూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## క్రిస్ సిటీ భూముల పరిశీలన



**కోట, జూలై 17 ప్రభాతవార్త :** కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని క్రిస్ సిటీ భూములను శుక్రవారం గూడూరు ఆర్డీఓ అరుణకుమారి పరిశీలించారు. ఆ భూముల తాలూకా రికార్డులను, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూముల వివరాలను తహశీల్దార్ కె.జయజయరావు ఆర్డీఓకి వివరించారు.

(See regulation-15(1) (a))

**విశాఖపట్నం డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షంలో**
గ్రౌండ్ & 1వ అంతస్తు, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-20

**O.A No. 572/2026**

బిట్వీన్ :
కెనరా బ్యాంక్, ఆత్మకూరు-II బ్రాంచ్, SPSR నెల్లూరు జిల్లా, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు బ్రాంచ్ మేనేజర్ ... దరఖాస్తుదారు
వర్సెస్
శ్రీమతి కొండ్రెడ్డి రాధమ్మ ... ప్రతివాది
ప్రతివాది: శ్రీమతి కొండ్రెడ్డి రాధమ్మ, భర్త: శ్రీనివాసులు రెడ్డి, వయస్సు 40 సంవత్సరాలు, వెంకట రెడ్డి పల్లి, అనంతసాగరం మండలం, SPSR నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524303.

**పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు ప్రత్యామ్నాయ జారీ**

1. గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డిఆర్‌టి విశాఖపట్నం వద్ద, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం 1993, సెక్షన్ 19 క్రింద దరఖాస్తుదారు ఇతర పరిహారాలతో పాటు అందులో తెలిపిన బ్యాంక్‌కు రావాల్సిన బకాయి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలను కలిపి మొత్తమును రాబట్టుకొనేందుకు దరఖాస్తు చేశారు. సదరు క్లెయిమ్‌కు జవాబు ఇచ్చేందుకు **తేది.07-08-2026, ఉ॥ 10.30 గం॥లకు** ట్రిబ్యునల్‌సమక్షంలో హాజరై వ్రాతకపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా ఆదేశిస్తూ మీకు సమన్లు జారీచేయడమైనది.
2. ట్రిబ్యునల్ ముందు మీరు హాజరైనప్పుడు అనుబంధంతో పాటు దరఖాస్తును సేకరించాలని మీకు నిర్దేశించబడింది.
3. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంతో పాటు ఒక లిస్ట్‌తో దానిని దాఖలు చేయవచ్చును.
4. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్‌సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
5. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.

నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.14 జూలై 2026 న విశాఖపట్నం నందు జారీచేయబడినది.
సమన్లు జారీ చేసిన అధీకృత అధికారి వారి సంతకం

# తాగునీటి సమస్య పరిష్కరించాలి



**వింజమూరు, జూలై 17, ప్రభాతవార్త :** మండలంలోని కాటేపల్లి పంచాయతీ పరిధిలో నల్లారెడ్డిపల్లి శారవాణి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆరు బోర్లు వేగా రెండు బోర్లు మాత్రమే నీరు పడ్డాయని పైప్ లైన్ విస్తరణ కూడా చేశారని. అధికారులు స్పందించి త్వరత గతిన మిగిలిన పనులను పూర్తి చేసి పథకం ఉపయోగంలోకి తెచ్చి సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో కే శ్రీనివాసులు రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వనపెంట హైమావతి, డిప్యూటీ ఎంపీడీవో కే రామారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాలు ముందుకు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు



**ఉదయగిరి, జులై 17, ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉదయ గిరిలో దుకాణాలు ఉన్న చోటు ఉండకుండా ఆర్‌అం డ్‌బి స్థలంలోకి చొర్చుకొని రావడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దుకా ణాలు నిర్దేశించిన స్థలంలో ఉండకుండా రోడ్డు మీదకి రావడంతో వాహనాల రాకపో కలకు వాహనాల పార్కింగ్‌కు తీవ్రమైన ఇబ్బంది ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. రెండు బస్సులు బస్టాప్లో నిలబడితే మూడో బస్సు వెళ్లడానికి అవకాశం ఉండదని కారణం కేవలం దుకాణదారులు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో రోడ్డు సర్వే చేసి దుకాణాలను తొలగించి మార్కింగ్ ఇచ్చినప్పటికి పరిస్థితి మామూలే అయిపోయింది. అధికారులు స్పందించి దుకాణాలు నిర్వహించుకునేందుకు మార్కింగ్ ఎక్కడికైతే ఇచ్చారో అంత వరకే ఉన్నట్లు చర్యలు తీసుకోగలిగితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని స్థానికులు సూచిస్తున్నారు.

# జల్లెడ పట్టాలిందే.. ఆచూకీ లేని ఓటర్ల పై బీఎలవ్వోలు దృష్టి

**కోట, జులై 17 ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్ ) ప్రక్రియకు ఈ నెల 24 వరకు గడువు పొడిగించడంతో ఆచూకీ లేని వారి ఓటర్ల పై అధికారులకు ప్రత్యేక దృష్టి సరిసారించారు. జాబితాల్లో ఎవరెవరూ ఉన్నారన్నది ఆరా తీసున్నారు. మరో వారం గడువు ఉండటంతో సాధ్యమైనంత ఎక్కవ మంది వివరాలు నమోదు చేయాలని భావిస్తున్నారు ఓటరు ఎవరైనా ఎన్యూమరేషన్ పత్రాలు బీఎవ్వోకు అందజేయకుంటే సమీప సచివాలయానికి వెళ్లి వివరాలు అందించొచ్చు. ఏఈఆర్ఓ లాగిన్‌తో వారి వివరాలను నమెదు చేసేందుకు అవకాశం ఉంటుంది. అచ్చు తప్పులతో లేదా మ్యాపింగ్ సక్రమంగా చేయకపోవడంతో ఏ ఓటరు అయినా తమ వివరాలను బీఎల్వోకు అందజేసి నమోదు చేయించుకోవచ్చును.

(See regulation-15(1) (a))

**విశాఖపట్నం డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షంలో**
గ్రౌండ్ & 1వ అంతస్తు, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-20

**O.A No. 579/2026**

బిట్వీన్ :
కెనరా బ్యాంక్, ఆత్మకూరు-II బ్రాంచ్, SPSR నెల్లూరు జిల్లా, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు బ్రాంచ్ మేనేజర్ ... దరఖాస్తుదారు
వర్సెస్
1. శ్రీ కొండ్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి
2. శ్రీ బట్రెడ్డి నరసింహ రెడ్డి ... ప్రతివాదులు
ప్రతివాది-2: శ్రీ బట్రెడ్డి నరసింహా రెడ్డి, తండ్రి: నరసింహులు, వయస్సు 66 సంవత్సరాలు, మింగల్లు గ్రామం, అనంతసాగరం మండలం, SPSR నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524303.

**పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు ప్రత్యామ్నాయ జారీ**

1. గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డిఆర్‌టి విశాఖపట్నం వద్ద, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం 1993, సెక్షన్ 19 క్రింద ధరఖాస్తుదారు ఇతర పరిహారాలతో పాటు అందులో తెలిపిన బ్యాంక్‌కు రావాల్సిన బకాయి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలను కలిపి మొత్తమును రాబట్టుకొనేందుకు ధరఖాస్తు చేశారు. సదరు క్లెయిమ్‌కు జవాబు ఇచ్చేందుకు **తేది.10-08-2026, ఉ॥ 10.30 గం॥లకు** ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై వ్రాతకపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా ఆదేశిస్తూ మీకు సమన్లు జారీచేయడమైనది.
2. ట్రిబ్యునల్ ముందు మీరు హాజరైనప్పుడు అనుబంధంతో పాటు దరఖాస్తును సేకరించాలని మీకు నిర్దేశించబడింది.
3. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంతో పాటు ఒక లిస్ట్‌తో దానిని దాఖలు చేయవచ్చును.
4. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
5. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.

నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.14 జూలై 2026 న విశాఖపట్నం నందు జారీచేయబడినది.
సమన్లు జారీ చేసిన అధీకృత అధికారి వారి సంతకం

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి

**- నాపా వెంకటేశ్వర్లు నాయుడు**



**కొడవలూరు, జూలై 17 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమాలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరు కానున్నారు. ఆమె రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు రహదారుల ఇరువైపులా మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో టీడీపీ కొడవలూరు మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు శుక్రవారం కార్యక్రమం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులతో కలిసి కార్యక్రమ స్థలం, వేదిక, ఇతర ఏర్పాట్లను తనిఖీ చేసి, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అజయ్ బాబు, టీడీపీ కొడవలూరు సోషల్ మీడియా కన్వీనర్ కోవూరు వెంకీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కాన్ సెంటర్ కేంద్రాలు తప్పక నియమాలు పాటించాలి



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** జిల్లాలో ఉన్న అన్ని స్కాన్ సెంటర్లు పీసీసీ అండ్ టీ యాక్ట్ నియమాలు తప్పక పాటించాలని టీబీ, ఎయిడ్స్, లెప్రసీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలో ఉన్న స్కానింగ్ మిషన్‌ను ప్రయోగశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైతే రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో బాధ పడుతుంటే వారందరూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కానీ కఫం పరీక్షాలను చేయించుకోవాలన్నారు. ఈ కఫానికి సంబంధించి ప్రత్యేక ప్రయోగశాలలు ఉన్నాయని, వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాజిటివ్ అని నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు సంబంధిత రోగికి అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌కు, వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వంశీ, సూపర్‌వైజర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

# డిగ్రీ కళాశాలలో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలి



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** కోవూరు మండలం నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పారిశుధ్యం కోసం చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని సంబంధిత కళాశాల అధ్యాపకులు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. చెత్త కుండీలు లేని కారణంగా పలు ప్రాంతాల్లో చెత్త నిండిపోయి ఉందని, ఈ విషయంలో ఎంపీడీవో తగు చొరవ తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు ఎంపీడీవో స్పందిస్తూ వెంటనే చెత్త కుండీలను ఏర్పాటు చేయడంతో పాటు చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎన్‌పీసీ లింక్ కలిగిన బ్యాంక్ ఖాతాలు తప్పనిసరి



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** తల్లికి వందనం నిధులను ఈ నెల 27వ తేదిన ప్రభుత్వం విడుదల చేస్తుందని, ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులు బ్యాంక్ ఖాతాలు లేకపోతే వెంటనే ఖాతాలు ఓపెన్ చేసుకుని సంబంధిత అకౌంట్‌ను ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌పీసీఐ లింక్ చేసుకున్న ఖాతాలకు మాత్రమే తల్లికి వందనం నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఖాతా కలిగి ఉండి ఎన్‌పీసీఐ లింక్ కాని విద్యార్థులు వెంటనే సంబంధిత బ్యాంక్‌లను సంప్రదించి లింక్ చేయించుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా లేని ఎస్సీ విద్యార్థులు వెంటనే ఎన్‌పీసీఐ లింక్‌తో ఖాతా ఓపెన్ చేసుకోవాలన్నారు. దీనిపై మరింత సమాచారం కోసం ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో 9182121723 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# భార్య ఆసుపత్రిలో .. రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

**కోట, జులై 17 ప్రభాతవార్త :** కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన ముజిప్ (30 ) తన భార్య నెల్లూరులోని ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిచింది. భార్యను చూసేందుకు వేళ్తేతూ కొండుగుంట గ్రామం వద్ద ముజిప్ విద్యుత్ స్థంభానికి బైక్ ఢీకొనడంతో అక్కడెక్కడే ముజీప్ మృతి చెందాడు. ఈ విషాదవార్తతో భార్య ఆసుపత్రిలో కన్నీటి పర్వతం అవుతుండగా ఇటు బంధవులు మృత దేహం వద్ద విలపిస్తున్నారు.

# పాఠశాలలను పరిశీలించిన ఎంఇఒ



**సీతారామపురం జులై 17 ప్రభాతవార్త :** మండలంలోని నెమళ్ళదిన్నె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఇఒ మస్తాన్ వలి ఆకస్మిక తనీకి చేశారు. ముందుగా విద్యార్థులతో కలిసి ప్రార్ధనా గీతం ఆలపించి, ఉపాధ్యాయులు యొక్క బోధనా పద్ధతులు ప్రణాళికలను పరిశీలించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకంను క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వి రవి ప్రసాద్, క్లషర్ ఉపాధ్యాయుడు సికోండయ్యతో కలిసి పరిశీలించారు. పాఠశాల రికార్డులన్నింటిని పరిశీలించి తగు సూచనలు ఉపాధ్యాయులకు అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణా, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాన్ని పరిశీలించనున్న చైర్‌పర్సన్




**సీతారామపురం జులై 17 ప్రభాతవార్త :** జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ మేకపాటి శాంతకుమారి శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సీతారామపురం మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించనున్నట్లు మేకపాటి శాంతకుమారి కార్యాలయం నుండిఒ ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రంథాలయ అభివృద్ధిలో భాగంగా పరిశీలించి మౌళిక వసతుల కల్పన అభివృద్ధికి చేపట్టాల్సి న పనులను తెలుసుకోవడానికి గ్రంథాలయాన్న పరిశీలించేందుకు వస్తున్నారని తెలిపారు.

# కోటలో 24న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్


**కోట, జులై 17 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమగ్రాబివృద్దే లక్ష్యంగా కృషి చేస్తోంది. చదువుతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరమని భావించి వారితో సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ నెల 24న కోట మండలంలో పెద్ద ఎత్తున్నమెగా (పీటిఎం)ను నిర్వహించనున్నట్లు కోట మండల విద్యాశాఖధికారి డి.మస్తానయ్య తెలిపారు. ఆయన శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లీప్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు తెలిసేలా అమలు చేస్తామన్నారు. దాతల సహకారంతో పాఠశాలల్లో మౌలిక వసతులకు ఇతర అభివృద్ధి కోసం దాతల సహకారంతోనూ పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

# బీసీ గురుకుల పాఠశాలలో తనిఖీలు



**కోట, జూలై 17 ప్రభాతవార్త :** కోటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను శుక్రవారం డిప్యూటీ డీఈఓ శరత్‌కుమార్ తనిఖీలు చేశారు. పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేయాలని, అవసరమైన వాటికే ఖర్చు పెట్టాలని సూచించారు. 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో మరోసారి అగ్రస్థానంలో నిలిచే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఓ దారా మస్తానయ్య ఉన్నారు.

# కేశవరం సచివాలయంలో తనిఖీలు



**కోట, జూలై 17 ప్రభాతవార్త :** కోట మండలం కేశవరం స్వర్ణ సచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఓ ఆర్.దిలీప్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అటువంటి వారి పట్ల చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ హెచ్చరించారు.

# వెంకన్నపురానికి నేడు ఎమ్మెల్యే రాక



**కొడవలూరు, జూలై 17 ప్రభాత వార్త :** కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శనివారం కొడవలూరు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు వెంకన్నపురం గ్రామ పంచాయతీ పరిధిలో బీటీ రోడ్డు ప్రారంభోత్సవంతో పాటు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ కొడవలూరు మండల పార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

# రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**నెల్లూరు క్రైం, జూలై 17, ప్రభాతవార్త :** రైలు కిందపడి ఒక గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. మృత్తునికి 30-35 ఏళ్ళ మధ్య వయసు ఉంటుందని, పసుపు రంగు గల ఫుల్ హాండ్స్ టి షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడిని గుర్తించడానికి మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్ ఫిర్యాదు మేరకు జిఆర్పీ ఎస్సై హరిచందన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయుచున్నారు.

## పీఎంశ్రీ బడుల్లో సౌరభాలు : డిప్యూటీ డీఈఓ శరత్‌కుమార్



**కోట, జూలై 17 ప్రభాతవార్త** కోటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను శుక్రవారం డిప్యూటీ డీఈఓ శరత్‌కుమార్ తనిఖీలు చేశారు. పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేయాలని, అవసరమైన వాటికే ఖర్చు పెట్టాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైనవిద్యను అందించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పాఠశాల్లో క్రీడా మైదానాలు, పాల్ ల్యాబ్స్ స్కౌట్ అండ్ గైడ్స్, ఏర్పాటు, సీడబ్ల్యుఎస్ఎస్‌టాయిలెట్ల ఏర్పాట్లు లక్షలతో ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాల్లో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదలు జరగకుండా పాఠశాల ఆస్తులకు నష్టం చోటు చేసుకోకుండా ఉండేందుకు ఈ నిఘా నేత్రాలు ఉపయోగపడుతాయన్నారు. పాఠశాల లోపలికి అపరచిత వ్యక్తులు వస్తే ఇట్టే తెలిసిపోతుందన్నారు. అలాగే తరగతిలో ఉపాధ్యాయులు బోధన విద్యార్థుల క్రమశిక్షణను పర్యవేక్షించవచ్చున్నారు. పరీక్షల వేళ అక్రమాల చోటు చేసుకొకుండా చర్యలు తీసుకొచ్చాన్నారు.

## సిద్ధవరంలో మారనున్న రాజకీయ సమీకరణలు

### - సైకిల్ ఎక్కనున్న దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి



**కోట, జూలై 17 ప్రభాతవార్త** కోట మండలం సిద్ధవరం పంచాయతీలోని రాజకీయ సమీకరణలు మారనున్నాయి. సిద్ధవరం పంచాయతీలోని వైసీపీ సీనియర్ నాయకులు దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి కుటుంబం వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. దువ్వూరు రాజగోపాల్‌రెడ్డికి వైసీపీలో తగిన గౌరవం లేక పోవడంతో ఆయన గత కొంతకాలం నుంచి అసంతృప్తితో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు సామాజిక మాధ్యమంలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. శుక్రవారం కోట మండల టీడీపీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, కోట మండల టీడీపీ మాజీ కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి తదితరులు దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో రాజకీయ మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాలతో తామంతా రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. త్వరలో రాజగోపాల్‌రెడ్డి తన అనుచరులతో టీడీపీలో చేరతారని టీడీపీ నాయకులు చెప్పారు.

## ఇక మాది.. కొత్త బంగారులోకం

### - ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు పచ్చజెండా



**కోట, జూలై 17 ప్రభాతవార్త** ఇంజినీరింగ్ విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియను ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ఉన్నత విద్య కమిషనరేట్ షెడ్యూల్ విడుదల చేసింది. విద్యా సంవత్సరంలో కనీస ఫీజు రూ.47 వేలుగా ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ప్రస్తుతం రూ.40 వేలు ఉండగా, రూ.7 వేలను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో 12 ఇంజినీరింగ్ కళాశాలలుఉన్నాయి. అందులో 7 వేల సీట్లు వరకుఉన్నాయి. ఇప్పటికే మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల గురించి తల్లిదండ్రులు కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. గతంలో నిర్ణయించిన ఫీజులు 2025-26 విద్యా సంవత్సరంలో ముగిశాయి. 2026-27లో కొత్త ఫీజులు అమల్లోకి రావాలి. కళాశాలల ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త ఫీజులను త్వరలో ఖరారు చేయనున్నారు. ఆగస్టు 10 నుంచి తరగతులు ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సిలింగ్‌కు 16న నోటిఫికేషన్ విడుదల చేసి, రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజుల చెల్లింపునకు 20 నుంచి 29వ తేదీ వరకు పదిరోజుల పాటు అవకాశాన్ని కల్పించారు. ధ్రువపత్రాల పరిశీలన 22 నుంచి 31 వరకు పదిరోజుల పాటు నిర్వహిస్తారు. కళాశాలల బ్రాంచిల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 25 నుంచి 31వ తేదీ వరకు వారంరోజుల పాటు అవకాశం కల్పించారు. వెబ్ ఐచ్ఛికాల మార్పు ఆగస్టు 1న, సీట్ల కేటాయింపు 6న చేయనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో 7 నుంచి 13వ తేదీలోపు చేరాల్సి ఉంది.

## గ్రామాల్లోనే నాణ్యమైన వైద్యసేవలు



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూ ప్రాంతలకు వెళ్లాల్సిన ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ప్రాథమిక వైద్యసేవలు గ్రామంలోనే అందలనే లక్ష్యంతో ఈ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో 36 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకే ఈ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. అంతకుముందు ఊరి పొలిమేర నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య జొన్నవాడ దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, మాజీ సర్పంచ్ వాణి, అమరావతి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలు బాల రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, జహాంగీర్, సాధిక్, మురళి, తదితరులు ఉన్నారు.

## వీపీఆర్ నేత్ర పేదలకు వరం



**కోవూరు, జూలై 17 ప్రభాతవార్త :** వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ఏర్పాటుచేసిన వీపీ ఆర్ నేత్ర పేద ప్రజలకు గొప్పవరం లాంటి దని మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. కోవూరు మండలంలోని చుండు గుంట ప్రాంతంలో శుక్రవారం వీపీఆర్‌నేత్ర కంటి పరీక్ష శిబిరం పూర్తి అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవూరు మండలంలో గత 20 రోజులుగా వీపీఆర్ నేత్ర బస్సు ద్వారా 10226 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 7 వేల మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేయడం జరిగిం దన్నారు. ఇప్పటికే గతంలో క్యాన్సర్‌బస్సు ఏర్పాటు చేసి ఈ వ్యాధికి సంబంధించి ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు బస్సులు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. వీపీఆర్ దంపతులు రాజకీయాలకు రాకమునుపే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ప్రస్తుతం వీపీఆర్ నేత్ర ద్వారా ఎంతో మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు కూడా ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఇటువంటి మంచి సామాజిక సేవా కార్యక్రామలకు శ్రీకారం చుట్టిన వేమిరెడ్డి దంపతులకు కోవూరు నియోజకవర్గ ప్రజానీకం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకరించిన వీపీఆర్ నేత్ర వైద్యులకు, ఉద్యోగులకు, సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలుపెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మహేష్, మురళి, తదితరులు ఉన్నారు.



## నీట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం



**నెల్లూరు, జులై17 ప్రభాతవార్త-విద్య** ఎన్‌టిఏ విడుదల చేసిన నీట్-2026 ఫలితాల్లో నగరంలోని స్థానిక నారాయణ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి ప్రతిభ కనపరిచారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో నెల్లూరు చెందిన 8మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. చుండి అభిషేక్64 ర్యాంకు , అద్వైత కార్తికేయని 106, మంచాల హాసిత్ సాయి 312, కే.హనీష్‌రెడ్డి586, జే.అభిషయ్ జస్టీస్ 629, సి.శ్రీవల్లి888, కే.భవ్యశ్రీ892, బి.భువనశ్రీ946వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలోని స్థానిక మెడికల్ కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతు సుమారు 400 కుపైగా మెడికల్ సీట్లను నారాయణ విద్యార్థులు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో 1000 లోపు 8మంది , 2000 లోపు 15మంది, 3వేల లోపు 20మంది, నాలుగు వేల లోపు 25మంది, 5వేల లోపు 29మంది, 10వేలలోపు 52,మంది, 20వేల లోపు106మంది అర్హత సాధించటం గర్వకారణమన్నారు. తమ పటిష్టమైన విద్యాభోదన, మైక్రోషెడ్యూల్, తదితర అంశాలు ఇంతటి విజయాలు సాధించేందుకు దోహద పడ్డాయన్నారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోర్‌డీన్స్, డీన్‌లు, ఏజిఎంలు, ప్రిన్సిపాల్స్, అద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ 2026 ఫలితాల్లో విశ్వసాయి విద్యార్థులు విజయభేరి




**నెల్లూరు, జులై17 ప్రభాతవార్త-విద్య** ఎన్‌టిఏ విడుదల చేసిన నీట్ 2026 ఫలితాల్లో నగరంలోని స్థానిక విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు అత్యంత్త ప్రతిభ కనపరిచి విజయభేరి మోగించారు. డి.ఉష 510, కే.గీతిక హాసిని506, ఆర్.ప్రశాంతి505, ఆర్.స్నేహశ్రీ 494 సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్ వై.శివసంకేత్‌లు విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించటం సంతోషంగా ఉందన్నారు. సుమారు 80మందికి పైగా విద్యార్థులు డాక్టరు అవ్వడానికి అర్హత సాధించటం గర్వకారణమన్నారు. ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరే విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఘనంగా హ్యాకథాన్ ప్రయోగ్-2026



**గూడూరు, జూలై 17, ప్రభాతవార్త** విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆది శంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హ్యాకథాన్ ప్రయోగ్-2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌లో మొత్తం 60 బృందాలు, ఒక్కో బృందంలో 2 నుంచి 4 మంది విద్యార్థులతో ఉత్సాహంగా పాల్గొన్నాయి. హెల్త్ టెక్నాలజీ, అగ్రిటెక్ సస్టైనబుల్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఫైనాన్షియల్ టెక్నాలజీస్ బ్లాక్ చెయిన్, ఎడ్యుకేషన్ టెక్నాలజీ, స్మార్ట్ సిటీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్స్, ఓపెన్ ఇన్నోవేషన్, వంటి విభాగాల్లో వాస్తవ ప్రపంచ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను రూపొందించి ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెఫర్సన్ డి. ఈఆర్‌పి ఇంప్లిమెంటేషన్ ఆటోమేషన్ స్పెషలిస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఇంజినీర్లకు పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు, ఆటోమేషన్ సాంకేతికతలు, ఆవిష్కరణాత్మక దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 6 గంటల పాటు నిరంతరంగా నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో విద్యార్థులు తమ ఆలోచనలకు రూపకల్పన చేసి, ప్రోటోటైప్స్‌ను అభివృద్ధి చేసి, సాంకేతిక పరిష్కారాలను నిపుణుల ముందు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఆవిష్కరణ, సాంకేతిక సాధ్యత, అమలు విధానం, విస్తరణ సామర్థ్యం సామాజిక ప్రయోజనం వంటి అంశాల ఆధారంగా నిపుణుల బృందం మూల్యాంకనం చేసింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డా. వంకి పెంచలయ్య, చైర్మన్ వంకి అరవింద, ఛాన్సలర్ వంకి అనూష, ప్రో ఛాన్సలర్ డా. ఎ. మోహన్‌బాబు, ప్రో వైస్ ఛాన్సలర్ డా.ఎం. రాజయ్య, రిజిస్ట్రార్ డా. ధనుంజయ, ప్రొఫెసర్ డీన్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఈసి విభాగాధిపతి మాట్లాడుతూ హ్యాకథాన్ ప్రయోగ్-2026 విద్యార్థుల సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా అన్వయించుకోవడానికి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధమయ్యేందుకు ఉపయోగకరమైన వేదికగా నిలిచిందని తెలిపారు. విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే విశ్వవిద్యాలయ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## జొన్నవాడ కామాక్షితాయి అన్నదానానికి 2లక్షలా 5 వేలు



**బుచ్చి జులై 17 ప్రభాతవార్త** పవిత్రపుణ్య క్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో అన్నదానానికి చిన్నపడుగుపాడు వాస్తవ్యులు అట్లూరు బుజ్జిరెడ్డి, అక్కమ్మ దంపతులు వారి కుటుంబ సభ్యులు శాశ్వత నిత్య అన్నదానానికి 2 లక్షలా 5 వేల రూపాయాలు దేవస్దానం కమీషనర్ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారి గోత్రనామాలతో శ్రీమల్లికార్జునస్వామి వారికి శ్రీకామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించారు. తీర్ధ ప్రసాదాలు అందజేసి, డోనేషన్ బాండ్ అందజేశారు.

## నీట్ ఫలితాల్లో సత్తా చాటిన డాక్టర్ కిషోర్స్‌రత్నం విద్యార్థులు



**నెల్లూరు, జులై17 ప్రభాతవార్త-విద్య** ఎన్‌టిఏ విడుదల చేసిన నీట్ 2026 ఫలితాల్లో నగరంలోని స్థానిక డాక్టర్ కిషోర్స్‌రత్నం కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. లాస్యశ్రీ 523, దామిని 522, రాజేశ్వరి 475, మధుశ్రీ 463, ఎం.కృప 448, ఆర్ కార్తీక మాధురి సింగ్438, ఎస్‌కే.మన్షిలాక్424, టి.భావన 420, ధీరజ్496, కిరణ్మయి 465, వైష్ణవి452, వెంకట సాయి ప్రణీత 440, రితికా షెరల్ 435, రీనా ఎంజల్ 423, మార్కులు సాధించిన సత్తా చాటారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్దులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల జిఎం రామూర్తినాయుడు మాట్లాడుతు తమ విద్యార్దులు జాతీయ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించటం గర్వకారణమన్నారు. తమ విద్యార్దులు సాధించిన ఫలితాల పట్ల విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాంసంతి కిషోర్‌లు హర్షం వ్యక్తం చేయటం జరిగిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యార్దులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్దులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నీట్ అకడమిక్ హెడ్ రఘుపతి నాయుడు, అకడమిక్ అడ్వైజర్ నరసయ్య నాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, అద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో ఓవెల్ విద్యార్థుల ప్రతిభ



**నెల్లూరు, జులై17 ప్రభాతవార్త-విద్య** ఎన్‌టిఏ విడుదల చేసిన నీట్ 2026 ఫలితాల్లో నగరంలోని స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్దులు అత్యంత్త ప్రతిభ కనపరిచి సత్తాచాటారు. ఎన్.మినాలి 471, ఆర్.ఆశ్రిత 471, యస్విన్ 444, జి.లోకేష్ యాదవ్ 459, ఎం.వెంకటేశ్వర్లు 433, పి.ఆండ్రియా మేరి 440, నవ్యశ్రీ 432, సుష్మా ఏంజల్ 402, కే.రక్షిత 407 మార్కులతో సత్తా చాటారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్దులకు అభినందన కార్యక్రమాన్ని చేపట్టారు. ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్ విద్యార్దులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ విద్యార్దులు 20 మంది మెడికల్‌కు అర్హత సాధించటం గర్వకారణమన్నారు. ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఈఓ ఆర్.ప్రమీల, జిఎం.మహదేవయ్య, సిబ్బంది బాలు, అఖిల్ , మణజమాల్, ఉమామహేశ్వరావు, వెంకటేశ్వరరావు, బి.రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కురుగొండ్ల జన్మదిన వేడుకలు

### - వేడుకలలో ఉత్సహంగా పాల్గోన్న మహిళలు ,తెలుగు తమ్ముళ్ళ



**కలువాయి జులై 17 ప్రభాతవార్త :** వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో లీతెలుగుదేశం పార్టీ శ్రేణులు అట్టహాసంగా నిర్వహించగా తెలుగు తమ్ముళ్ళు ,స్త్రీశక్తి నారిమణిలు అభిమానులు ఉత్సహంగా పాల్గోని కోలహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలువాయిలోని పార్టీ కార్యాలయం నందు పార్టీ మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి ఆద్వర్యంలో కేకు కట్ చేశారు. మండలంలోని పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గోని స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణా మరెన్నె పుట్టినరోజులు జరుపుకోవాలని వారు కాంక్షించారు. ఎమ్మెల్యే మండలాభివృద్దికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు కొనియాడాలరు. ఈ వేడుకలలో పాల్గోన్న మాజీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లునాయుడు, పార్టీ మండల ఉపాధ్యాక్షులు జి హరిబాబు, సొసైటీ చైర్మన్ జి. జగదల్‌నాయుడు, పార్టీ సీనియర్‌నాయకులు పీర్ల సోమయ్యయాదవ్, కిషోర్‌రెడ్డి, పార్టీ టౌన్ అద్యక్షులు నరసింహు యాదవ్, కలువాయి, తెలుగురాయిపురం నీటి సంఘం అద్యక్షులు సిహెచ్ విజయ్‌బాస్కర్‌రెడ్డి, రాం నారాయణరెడ్డి, సొసైటీ మెంబర్ నాలే పెంచలయ్య, దాచూరు మాజీ సర్పంచ్ రాజుల అనురాధా శ్రీనివాసులురెడ్డి, చింతలాత్మకూరు మాజీ సర్పంచ్ ఏలూరు ప్రభావతి ,వెంకటేశ్వర్లు, నూకనపల్లి మాజీ సర్పంచ్ చల్లా మమతా ,రాధారెడ్డి, సీనియర్‌నాయకులు జి.చంద్రమౌళి, గుంజి రవి, నారాల సునీల్, కార్యక్రమంలో పాల్గోని శాసనసభ్యులు కురుగొండ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ మండల ఉపాధ్యాయులు చల్లా శ్రీనివాసులురెడ్డి, క్లషర్ కో కన్వీనర్ టి సుధాకర్‌రెడ్డి, చవటపల్లి మాజీ సర్పంచ్ డి,చంద్రయ్య, కేశగోపవరం మాజీ సర్పంచ్ జి రమణారెడ్డి, కుల్లూరు మాజీ ఎంపిటిసి డి వెంకటేశ్వర్లు, మండల 7 వ యూనిట్ ఇంచార్జి ఆర్ బాలయ్య, నాయకులు తోమాటి రాములు, కండే ప్రసాద్, బొల్లు సుదర్శన్‌లు, పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

**బోజన వసతి, విద్యాసామాగ్రి పంపిణి :** వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని వెంకటరామరాజుపేట చింతలపాళెం గ్రామాలలో పార్టీనాయకులు పాల్గోని ఆయా పంచాయితీలోని పాఠశాలలోని విద్యార్దులకు విద్యాసామాగ్రి అందజేశారు. మద్యహ్నో బోజన వసతి కల్పించారు. విద్యార్దులకు కేకు కట్ చేసి పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సిహెచ్ రఘురామిరెడ్డి , బి.హజరత్‌నాయుడు, అమర్తలూరు రవీంద్రబాబు, ఆవుల జనార్దన్, ముక్కు సూర్య, నాయకులు, గ్రామస్తులు పాల్గోన్నారు.

